

పాస్‌పోర్ట్ రాగానే పరవశించిపోతారు... వీసా అందగానే దేశానికి వీడ్కోలు పలుకుతారు... కాలం గడిచేకొద్దీ కెరీరే పరమావధి అవుతుంది... దూరం పెరిగినా కొందరికి కన్నభూమిపై మమకారం తరగదు... ప్రవాసులైనా పుడమితల్లి ప్రసవ వేదన సమస్యల్ని మర్చిపోరు... అనురాగాల వారధులు వేసి సేవల బంధాలు అల్లుతారు... మాతృభూమి సేవకై స్మరిస్తూ తరిస్తారు... అలాంటి ప్రవాసాంధ్రులతో మాట కలిపింది 'ఈతరం'.



ఈతరం

# యువ ప్రవాసులు... సేవకి వారధులు!

## అవకాశాలు వదిలి.. అందరికోసం కదిలి

ప్రఖ్యాత హార్వర్డ్ విశ్వవిద్యాలయంలో వైద్యవిద్య. నాసాతో కలిసి పని చేసిన అనుభవం. కొత్త ఆవిష్కరణలతో దేశాల్ని మెప్పించిన ఘనత. ఇదీ ఇద్దరు అన్నదమ్ముల నేపథ్యం. తలచుకుంటే అమెరికాలోనే అత్యుత్తమ వైద్యులుగా రాణించే అవకాశం. ఇవన్నీ కాదనుకొని మాతృభూమికే మొదటి ప్రాధాన్యం అంటున్నారు **డా.శిశిర్ రావు, సేవిత్ రావు**లు. ఆ ఒరవడిలోనే 'ఇండియన్ హార్ట్ అసోసియేషన్', 'ఇండియన్ స్ట్రోక్ అసోసియేషన్' ప్రారంభించి సేవల ప్రస్థానం కొనసాగిస్తున్నారు.

శిశిర్, సేవిత్‌ల తాత హైదరాబాద్‌లోని సెంట్రల్ బ్లడ్‌బ్యాంక్‌లో డైరెక్టర్. అవసరాల్లో ఉన్నవారిని ఆదుకునే మనస్తత్వం. పదిహేనేళ్ల కిందట బ్రెయిన్ ట్యూమర్‌తో తీవ్ర అనారోగ్యానికి గురయ్యారు. మెరుగైన వైద్యం కోసం అమెరికా తీస్కెళ్లారు. ఎన్ని శస్త్రచికిత్సలు చేసినా, ఎంత జాగ్రత్తగా చూసుకున్నా రెండేళ్లకి మించి బతకలేదు పెద్దాయన. అక్కడే ఉన్న శిశిర్, సేవిత్‌లు అప్పుడు చిన్నపిల్లలు. తాత పరిస్థితి చూశాక డాక్టర్లు కావాలనే నిర్ణయానికొచ్చారు. ఈ సంఘటన మరవకముందే శిశిర్, సేవిత్‌ల తండ్రికి చిన్నవయసులోనే తీవ్రమైన గుండెనొప్పి వచ్చింది. ఎలాంటి చెడు అలవాట్లు లేని వ్యక్తి. క్రమం తప్పకుండా వ్యాయామం చేసేవారు. అయినా ఎందుకిలా జరిగిందో అంతుచిక్కలేదు. కారణాలు తెలుసుకోవాలని వైద్యుల్ని కలిశారు. అంతర్జాలం జల్లెడ పట్టారు. చివరికి తేలిందేమిటంటే భారతీయుల్లో గుండెజబ్బులకు ముఖ్యకారణం జన్యుపరమైన లోపాలేనని గ్రహించారు. అప్పుడే మాతృదేశానికి ఉపయోగపడేలా, గుండెజబ్బులపై జనాల్ని చైతన్య పరిచేలా ఏదైనా సంస్థ ప్రారంభించాలనుకున్నారు. లక్ష్యం స్పష్టంగా ఉండటంతో చదువును అలక్ష్యం చేయలేదు. దానికనుగుణంగానే రైస్ యూనివర్సిటీలో ప్రిమెడిసిన్ కోర్సులో చేరాడు శిశిర్. నాలుగేళ్ల కోర్సుని రెండేళ్లలోనే ముగించాడు. మిగతా సమయం ప్రఖ్యాత అంతరిక్ష పరిశోధన సంస్థ నాసాతో కలిసి పనిచేశాడు. అంతరిక్షంలో వ్యోమగాముల శరీర స్థితి కనిపెట్టేలా ఓ డయాగ్నస్టిక్ సిస్టమ్ కనిపెట్టి శిక్షణనిచ్చాడు. ఈ అనుభవంతో శిశిర్ రాసిన వ్యాసాలు ప్రఖ్యాత జర్నళ్లలో ప్రచురితమయ్యాయి. ఆపై బేలర్ కాలేజ్ ఆఫ్ మెడిసిన్‌లో ఎండీ కోర్సు పూర్తి చేశాడు. తర్వాత అతడి ప్రస్థానం ప్రఖ్యాత హార్వర్డ్ విశ్వవిద్యాలయానికి చేరింది. దీనికి అనుబంధంగా ఉన్న మసాచుసెట్స్ జనరల్ హాస్పిటల్‌లో సీటు సంపాదించాడు. రేడియాలజీ న్యూరో ఇంటర్వెన్షన్ విభాగంలో కేవలం తొమ్మిది సీట్లుంటే ప్రపంచ వ్యాప్తంగా దీనికి ఇరవై వేల మందిపోటీ పడ్డారు. మరోవైపు అన్నబాటలోనే అడుగులు వేస్తూ రైస్ యూనివర్సిటీలో ప్రిమెడిసిన్ పూర్తి చేశాడు సేవిత్. సంస్థ కార్యకలాపాల్లో చురుగ్గా వ్యవహరిస్తున్నాడు.

### సేవల బాటలో..

ప్రపంచ గుండెజబ్బుల్లో మన వాటా 60 శాతం. జన్యుపరమైన లోపాలే దీనికి ఒక ముఖ్యకారణం. దీంతోపాటు ఒత్తిడితో కూడిన జీవన విధానం, ఆహారపు అలవాట్లు, వ్యాయామం లేకపోవడం.. సహజంగానే జనం గుండె జబ్బుల బారిన పడటానికి కారణమవుతున్నాయి. వీటిని అదుపు చేయడానికే 2008లో ఇండియన్ హార్ట్ అసోసియేషన్, ఇండియన్ స్ట్రోక్ అసోసియేషన్ ప్రారంభించారు అన్నదమ్ములు. దీనికి ముందే జనాల్లో ఎలా అవగాహన కల్పించాలో ప్రణాళికలు వేసుకున్నారు. ప్రభుత్వ పెద్దల్ని కలిశారు. పేరున్న పెద్ద ఆసుపత్రుల యాజమాన్యాలను సంప్రదించారు. ఐటీ సంస్థలు, కాలేజీలు, కార్పోరేషన్లు, క్లబ్‌లు, గ్రామీణ ప్రాంతాల్లో క్యాంపులు నిర్వహిస్తున్నారు. అక్కడికొచ్చే వ్యక్తులకు అన్నిరకాల కార్డియాక్ పరీక్షలు చేసి, వాళ్ల శరీర నిర్మాణానికి అనుగుణంగా ఎలాంటి ఆహార నియమాలు పాటించాలి, ఎలాంటి వ్యాయామలు చేయాలో సూచిస్తున్నారు. శస్త్రచికిత్సలు అవసరమైన వాళ్లకి తక్కువ ఖర్చుతో చేసేలా కొన్ని కార్పొరేటు ఆసుపత్రుల్ని ఒప్పించారు. ఇవన్నీ చేయడానికి తమ స్కాలర్‌షిప్‌లు, పార్ట్‌టైమ్ ఉద్యోగాలు చేస్తే వచ్చే మొత్తాన్ని సైతం ఖర్చు చేస్తున్నారు. అమెరికాలోనూ ఈ కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. సంస్థ వివరాలు, ఉపయుక్తమైన సమాచారాన్ని www.indianheartassociation.org వెబ్‌సైట్‌లో పొందుపరుస్తున్నారు. దాదాపు లక్షమంది వైద్య విద్యార్థులు సభ్యులుగా 'ఇండియన్ మెడికల్‌స్టూడెంట్స్ అసోసియేషన్'ని సైతం ఈ క్రతువులో భాగస్వాములుగా చేయడం వీళ్లు సాధించిన అతిపెద్ద విజయం. ఈ సేవల్ని గుర్తించిన బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ ఈ సంస్థకి 'ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ కార్డియోవాస్క్యులర్ అండ్ థొరాసిస్ సర్జరీ'లో సభ్యత్వం కల్పించింది. 'దేశమంతా తిరిగి ఉచితంగా సేవలందించడానికి మేం సిద్ధం. పరీక్షల కోసం ఒక్కో ప్రాంతంలో చిన్న ల్యాబ్, దానికి కావాల్సిన రసాయనాలను ప్రభుత్వం, కార్పొరేటు సంస్థలు సరఫరా చేయగలిగితే గుండెజబ్బుల కేంద్రంగా ఈ దేశంపై పడ్డ మచ్చ చెరిపేయొచ్చు' అంటున్నారు శిశిర్, సేవిత్‌లు. మరోవైపు సేవిత్ తయారు చేసిన డ్రెమోఫ్యూజ్ (సెంట్రీఫ్యూజ్) అనే పరికరం సియోర్రాలియోన్, బోట్సువానా దేశాల్లోని ఆసుపత్రులకు వరంగా మారింది. రక్త, మూత్ర పరీక్షలకోసం దీన్ని ఉపయోగిస్తారు. తక్కువ ఖరీదుండే ఈ పరికరాన్ని విద్యుత్తు వినియోగం లేకుండానే ఉపయోగించవచ్చు. ఎక్కడో వేల మైళ్ల దూరాన ఉన్నా సత్సంకల్పంతో ముందుకెళ్తున్న ఈ యువకులిద్దరికి ప్రభుత్వం, సమాజం అండగా నిలిస్తే వాళ్ల ఆశయం ఆచరణరూపం దాల్చడం పెద్ద కష్టం కాకపోవచ్చు.



## గ్రామస్థుల్ని కలుపుతాడు

**ఏసీ గదిలో కొలువు. సాఫీగా సాగిపోతున్న జీవితం. అంతటితో సంతృప్తి చెందలేదు ప్రకాశం జిల్లా యువకుడు రాహుల్ బాచిన. ఒక్క ఊరి వాళ్లందరినీ ఒక్కచోటికి చేర్చాలనుకున్నాడు. 'స్వగ్రామ్' ఊపిరిపోసుకుంది.**

రాహుల్ అందరిలాంటి కుర్రాడే. చదువైపోగానే సాఫ్ట్‌వేర్ రంగంపై మోజు పడ్డాడు. బోనస్‌గా ఇంగ్లండ్ అవకాశం కూడా తలుపు తట్టింది. పనితోపాటు ఫేస్‌బుక్ చాటింగ్‌లు, ఆన్‌లైన్ షేరింగ్‌లతో ఖుషీగా కాలం గడిచిపోయేది. 'సామాజిక అనుబంధాల వెబ్‌సైట్లు ఎక్కడెక్కడివారినో కలుపుతున్నాయ్. ఒకే ఊరి వాళ్లందరినీ ఒకేచోటికి చేర్చేలా నేనూ ఓ వెబ్‌సైట్ సృష్టించలేనా?' అని ఆలోచించాడు రాహుల్. ప్రోగ్రామర్ కావడంతో కోడింగ్ రాయడం కష్టం కాలేదు. కాన్సెప్ట్, సమాచారం కోసం సిస్టమ్‌కే అతుక్కుపోయేవాడు. వారాంతం, సెలవు దినాల్లో అయితే కంప్యూటర్‌కే అంకితం. ఓ మిత్రుడు వెబ్‌సైట్‌ని డిజైన్ చేసిపెట్టాడు. ఇండియాలో పల్లెలన్నింటినీ ఒకే గొడుగు కిందికి తెచ్చే పని మొదలైంది. ఏళ్లకేళ్లు కష్టపడితే www.swagraam.com మొదలైంది. ఇప్పటికి రాష్ట్రంలోని 27వేల గ్రామాల వివరాల్ని ఈ వెబ్‌సైట్‌తో అనుసంధానం చేశాడు. పద్నాలుగు వేల మంది సభ్యులుగా కూడా చేరిపోయారు.

### ఏం చేయొచ్చు?

సొంతూరంటే ఎవరికైనా మమకారమే. ముఖ్యంగా విదేశాల్లో ఉన్న వారికైతే మరీనూ! ఆ ఒక్కపాయింట్‌తోనే స్వగ్రామ్‌ని సమస్యల పరిష్కార వేదికగామార్చేయాలని భావించాడు రాహుల్. ప్రపంచంలో ఏ మూలనున్నా ఇందులో సభ్యులుగా చేరొచ్చు. తమ ఊరు, పట్టణం, నగరం పేజీల్లో సభ్యులయ్యే అవకాశం ఉంటుంది. లేదంటే సొంతంగా ఓ పేజీని సృష్టించుకోవచ్చు. తమ ఊరికి సంబంధించిన సమాచారం, ఫొటోలు, వీడియోలు జత చేయొచ్చు. మిగతా సభ్యులతో గ్రామం మంచిచెడులు చర్చించొచ్చు. మేథోమథనాలు జరపొచ్చు. చివరికి సమస్య పరిష్కారానికి కొంతైనా ముందడుగు పడుతుంది. ఇలా గ్రామ సమస్యలపై స్పందించి ఆర్థికంగా, హార్థికంగా స్పందించిన ప్రవాసులెందరో. రాన్రాను సభ్యుల సంఖ్య పెరగడం, వెబ్‌సైట్ ట్రాఫిక్ పెరగడంతో హైదరాబాద్‌లో ఓ కార్యాలయం తెరిచారు. కేవలం సమస్యల పరిష్కారమే కాదు వినోదానికీ ఇందులో ప్రాధాన్యం ఉంది. చాటింగ్ ఆప్షన్, గేమ్స్, సర్వీసులు, కొత్త ఫీచర్లూ ఉన్నాయి.